"తిరుపతి డిపోకి కొత్త టైర్లు పంపాల్సిన బాధ్యత ఈయనదేట."

"అయితే!"

"పంపడంలో బాగా జాప్యం చేశారుట. అక్కడనుంచి పదోతారీకు రాత్రి బయలుదేరి హైదరాబాద్ వచ్చే బస్సు టైరులేక గంటన్నర ఆలస్యం అయిందిట. మరో బండిది తీసి వేశారుట కొత్తవి లేక. ఆ బస్‌లో ప్రయాణీకుల్లో ఎవరో వెధవ వూరుకోకుండా ఫిర్యాదుచేశాడుట ఆలస్యం అయిందని. అదంతా ఎంక్వయిరీకి వచ్చి, తప్పు ఈయనదని తేలిందిట. పనిష్మెంట్‌గా వారంరోజులు ఇంట్లో కూర్చోమన్నారుట జీతం లేకుండా."

"అలాగా!"

# యాదృచ్ఛికం

గంగరాజు కారోజు ఎదురయిన సమస్య కొత్తదేంకాదు. బాగా పాతదే. గంగరాజు ఆఫీసర్ ఆ ఆఫీసుకు బదిలీ అయి వచ్చినంత పాతదా సమస్య, ప్రతీసారి ఆ సమస్యకి ఏదో ఓ పరిష్కారం దొరుకుతూనే వుంది గంగరాజుకి.

అంత పెద్ద సమస్య కాకపోయినా, ఒకోసారి అది కొండంత సమస్యగా అనిపిస్తుంటుంది గంగరాజుకి.

అడగినప్పుడు అడిగినంత శెలవు మంజూరు చెయ్యడు గంగరాజు ఆఫీసరు. తను ఆఫీసర్‌గా గుర్తింపబడాలంటే, శెలవు మంజూరు చేయకుండా తను ఆఫీసరనే నిజాన్ని గుర్తు చేయాలనుకునే స్వభావం ఆయనది బహుశ.

దగ్గిరే ఉన్న అజంతా, ఎల్లోరా లని, నాలుగయిదురోజులు బొంబాయినీ చూడాలని సంసిద్ధమయ్యాడు గంగరాజు. కేవలం ఆరురోజులే

కాబట్టి శెలవు దొరకకపోతుందా అనే ధీమాతో ప్రయత్నాలు చేసేశాడు, రైల్వే టిక్కెట్ రిజర్వేషన్‌తోసహా.

గంగరాజు శెలవ అడుగబోయే ముందురోజే మరొకతను రెండు రోజులు కూడా శాంక్షన్ చేయలేదా దుర్మార్గపు ఆఫీసర్ గంగరాజు గుండెల్లో రాయిపడ్డట్టయింది.

మామూలుగా పరిస్థితుల్లో శెలవివ్వడని గ్రహించాడుగంగరాజు, స్వంత వూరునుంచి దొంగ "శెలవు టెలిగ్రాం" తెప్పించే వ్యవధి కూడా లేదు. తీవ్రంగా ఆలోచించాడు గంగరాజు.

మర్నాడు ఉదయం నేరుగా టెలిగ్రాఫ్ ఆఫీస్‌కి వెళ్ళి, అక్కడ పనిచేసే ఓ పాత పరిచయస్థుడి స్నేహితుడిని కాళ్ళావేళ్ళా బతిమాలి, తన వూరు నుంచి టెలిగ్రాం వచ్చినట్లుగా ఇంటి చిరునామాకి, ఓ టెలిగ్రాం తయారు చేయించుకున్నాడు.

ఎర్ర కాగితంమీద అంటించిన తెల్లకాగితపు పీలికలమీద, "ఫాదర్ సీరియస్ స్టార్ట్ ఇమ్మీడియట్లీ" అన్న వార్తని, తన శెలవు అప్లికేషన్‌కి జతచేసి పంపించాడు ఆఫీసర్ గదిలోకి.

శెలవు మంజూరయింది ఆఫీసర్ ఏకళనున్నాడో, "గుడ్‌లక్" అనికూడా వ్రాసాడు ఎగిరి గంతేసాడు గంగరాజు. వారం రోజులు ఇక ఆఫీసుమొహం చూడక్కర్లేదు.

గంగరాజు ముందు అనుకున్న విధంగా అజంతా, ఎల్లోరా, బొంబాయి చూసాడు. తనతో తీసుకెళ్ళిన కెమెరాతో నాలుగు రీళ్ళ ఫోటోలు తీసాడు, రీలుకి పన్నెండు ఫోటోలు చొప్పున.

శుక్రవారం నాడు బొంబేలో, దీపాలు పెట్టేవేళ,గేట్ వే ఆఫ్ ఇండియా దగ్గర, వర్షం పడుతుంటే తలదాచుకుని, లైట్లతో వెలిగిపోతున్న తాజ్‌మహల్ హోటల్‌ని చూస్తుంటే ఎవరో గంగరాజు భుజంమీద చెయ్యి వేసి తెలుగులో పలకరించారు.

అతన్ని చూడగానే గంగరాజు టారెత్తి పోయాడు. "ఎప్పుడు వచ్చారు? ఎప్పుడు వెళతారు?" అడిగాడతడు నవ్వుతూ.

"మ.... మ.... రే...." గొణిగాడు.

స్వయానా తన ఆఫీసర్ బావమరిదా అప్రాచ్యుడు, బావకోసం ఆఫీసుకి ఎన్నోసార్లు వచ్చి, గంగరాజుని చూసాడు. తనని ఇక్కడ చూసిన సంగతి ఆయనకు వూదేస్తే....?

గంగరాజు వర్షంలో తడుసునే పరిగెత్తాడు శివాజీ విగ్రహంవైపు తన ఆఫీసరు బావమరిదికి సరయిన సమాధానం ఇవ్వకుండా.

సోమవారం ఉదయం నాంపల్లి రెల్వేస్టేషన్‌లో దిగాక, గంగరాజుకి మళ్ళీ భయం మొదలయింది. ఆఫీస్‌కి నిర్లిప్తంగా వెళ్ళాడు ఆఫీసరుకి ఈ పాటికి తను ఆడిన అబద్ధం తెలిపోయి వుంటుందా?" ఆ బావమరిది ఆదివారం చేరుకునుంటే, తనకన్నా ఓరోజు ముందుగా?.... భయం క్రమంగా తగ్గింది.

ఆఫీస్‌లో అడుగు పెట్టాక మళ్ళీ భయం మొదలయింది గంగరాజుకి, పావుగంట తర్వాత ప్యూన్ వచ్చి చెప్పాడు, ఆఫీసర్ పిలుస్తున్నారని.

గంగరాజు కాళ్ళు తడబడుతూంటే ఆఫీసరు గదిలోకి అడుగు పెట్టాడు మేకపిల్లలా. ఆఫీసరు పులిలా చూడలేదు.

"ఐయామ్ సారీ మిస్టర్ గంగరాజు" అంటూ గంగరాజు చేతిలో వుంచాడు ఆఫీసరు రెండు కాగితాలని

టెలిగ్రాంలు ఆ రెండూ, రెండూ ఇంటి నుంచి వచ్చినవే, గంగరాజు స్వగ్రామం నుంచి.

"ఫాదర్ సీరియస్. స్టార్ట్ ఇమ్మిడియట్లీ" అన్న ఆ మొదటి టెలిగ్రాం సరిగ్గా గంగరాజు శెలవుమీద వున్న మొదటిరోజు వచ్చింది. ఔరంగాబాద్‌లో గంగరాజు వున్నప్పుడు

"సారీ ఫాదర్ ఎక్స్‌పైర్డ్" అన్నది రెండవ టెలిగ్రాం గంగరాజు స్వగ్రామంనుంచి గంగరాజు సెలవుమీద వున్న అయిదవరోజు శుక్రవారం చేరింది ఆఫీస్‌కి బొంబాయిలో వున్నప్పుడు.

తట్టుకోలేక, గంగరాజు ఆఫీసర్ ఎదురుగా వున్న కుర్చీలో కూలబడ్డాడు.

# దిలావర్

ఆరోజు పోస్టులో వచ్చిన రెండు కవర్లని ఆత్రంగా చింపి చదివాడు సోమయాజి. ఆ రెండు కవర్లమీద అతను ఇదివరకు ఇంటర్వ్యూకి వెళ్ళిన కంపెనీ చిరునామాలు ముద్రించి వుండటంతో అతనిలో ఆ ఆత్రం.

రెండు రిగ్రెట్ లెటర్సే

సన్నగా నిట్టూర్చాడు సోమయాజి. వాటితో కలిపి నూట అరవై రెండు రిగ్రెట్ లెటర్స్ చూసాడు అతను ఇంతదాకా.

ఇంట్లోంచి బయట పడ్డాక ఏం చేయాలో తోచలేదు. మార్నింగ్ షో సినిమాకి వెళదామంటే డబ్బులేదు టీ తాగినా ఇరానీ రెస్టారెంట్‌లో ఎంత సేపు కూర్చుంటాడు!

బస్‌లో ఇందిరా పార్కుకి చేరుకున్నాడు. వారం, పదిరోజులకో సారి అతను తనసమయాన్ని అక్కడ గడుపుతుంటాడు. అలవాటు ప్రకారం ముందర పార్కంతా తిరిగాడు తర్వాత ఓ చెట్టు నీడలో, పచ్చి గడ్డిమీద పడుకున్నాడు. ఆకాశం వంక చూస్తూ తన మనస్సుని ఆలోచనా రహితంగా వుంచటానికి విఫల ప్రయత్నం చేయసాగాడు. వద్దనుకున్న కొద్దీ అతని మనసు నిండా ఆలోచనలు కలగాపులగంగ అల్లుకో సాగాయి.